# నినాదం

తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

ఆదివారం
26 ఏప్రిల్ 2026


## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగుల పంపిణీ




**వైరా ఏప్రిల్ 25, ( నినాదం):**
వైరా లైన్స్ క్లబ్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో చిరు వ్యాపారులకు గొడుగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ రీజినల్ సెక్రటరీ పెనుగొండ ఉపేందర్ రావ్, 12వ వార్డు కౌన్సిలర్ మాదినేని సునీత మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఎండ వేడిమిని తట్టుకునేందుకు, వర్షాకాలంలో సైతం ఉపయోగపడే విధంగా రోడ్డు ప్రక్కన చిరు వ్యాపారాలు నిర్వహిస్తూ ఉపాధి పొందే వారికి గొడుగులను అందజేస్తున్నామని పేర్కొన్నారు. సోడా వ్యాపారం నిర్వహించే బొడ్డు మోహన్ రావు, మరో చిరు వ్యాపారి ధనలక్ష్మి కి గొడుగులను అందజేశారు.

## వడదెబ్బ తగిలి మర్రిగూడెంలో వ్యక్తి మృతి

**కమలాపూర్ ఏప్రిల్ 25 (నినాదం)**



మండలంలోనిమర్రిపల్లి గూడెం గ్రామానికిచెందిన సాదుల నరహరి (58)అనే వ్యక్తి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు,గ్రామస్తులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం వృత్తిలో భాగంగా శుక్రవారం మోత్కు ఆకు (విస్తార్ల) సేకరించడానికి గ్రామ శివారు లోకి వెళ్లారు. ఆకు సేకరిస్తున్న క్రమంలో వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యారు.ఆ రోజు నుండి ఇంట్లోనే వుంటూ శనివారం మరోసారి అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు 108 కు సమాచారం తెలపడంతో వారు వచ్చి పరీక్షించి అప్పటికే మృతి చెందారని వారు తెలిపారు. మృతుడికి భార్య, కుమార్తె ,కుమారుడు ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## అదనపు కలెక్టర్‌కు ఎన్జీవో సంఘం సత్కారం

### జిల్లా అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో సమర్థ సేవలందించాలని ఆకాంక్ష



**కరీంనగర్, ఏప్రిల్ 25(నినాదం )**
కరీంనగర్ జిల్లాకు ఇటీవల బదిలీపై వచ్చిన అదనపు కలెక్టర్ (రెవెన్యూ) డి. శ్రీనివాస్ రెడ్డిని తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. జిల్లా పరిపాలనలో ఆయన అనుభవం, పారదర్శక విధానం, ప్రజా సంక్షేమంపై కట్టుబాటు కరీంనగర్ అభివృద్ధికి దోహదం చేస్తుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.రెవెన్యూ పరిపాలన, ప్రజా సమస్యల పరిష్కారంలో సమర్థవంతంగా సేవలందించాలని కోరుతూ శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాల అమలులో ఉద్యోగులతో సమన్వయం కొనసాగిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మడిపల్లి కాళీ చరణ్ గౌడ్, జిల్లా కోశాధికారి ముప్పిడి కిరణ్ కుమార్, నర్సింగ్రావు, రాష్ట్ర నాయకులు గూడ ప్రభాకర్ రెడ్డి, రాగి శ్రీనివాస్, సర్దార్ హర్మేందర్ సింగ్, పట్టణ అధ్యక్షుడు మారుపాక రాజేష్ భరద్వాజ్, గ్రామీణ అధ్యక్షుడు కోడూరి వాస్తవిక్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కోట రామస్వామి, కార్యదర్శి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయవచ్చు

### మెడికవర్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్టు రోబోటిక్ సర్జన్ డా. రవి చందర్ వెలిగేటి

**నిజామాబాద్ ప్రతినిధి, ఏప్రిల్ 25 (నినాదం) :**
క్యాన్సర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే సమర్థవంతంగా చికిత్స చేయవచ్చ మెడికవర్ సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్టు రోబోటిక్ సర్జన్ డా. రవి చందర్ వెలిగేటి అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని మెడికవర్ ఆసుపత్రిలో హైదరాబాద్ మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ నిపుణులు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం సుమారు 53,000కు పైగా కొత్త క్యాన్సర్ కేసులు నమోదవుతుండగా ప్రతి 10 నిమిషాలకు ఒక కొత్త కేసు వెలుగులోకి వస్తోందని అంచనాలు సూచిస్తున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో ముఖ్యంగా నిజామాబాద్‌లో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో క్యాన్సర్ కేసులు వేగంగా పెరుగుతున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నార న్నారు. ఈ నేపథ్యంలో క్యాన్సర్ చికిత్సలో తాజా అభివృద్ధులు, ఆధునిక సాంకేతికతలు , సమగ్ర వైద్య విధానాలపై వివరించారు. క్యాన్సర్ చికిత్సలో తాజా అభివృద్ధులు, ప్రెసిషన్ థెరపీలు, సమగ్ర వైద్య విధానాలు అనే అంశంపై వారు మాట్లాడారు. సీనియర్ కన్సల్టెంట్ సర్జికల్ ఆంకాలజిస్టు రోబోటిక్ సర్జన్ డా. రవి చందర్ వెలిగేటి మాట్లాడుతూ క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ప్రాణాలను కాపాడే అత్యంత కీలక అంశం. రోబోటిక్, మినిమల్లి ఇన్వేసివ్ సర్జరీల వల్ల రోగులకు తక్కువ నొప్పి, తక్కువ రక్తస్రావం, త్వరితగతిన కోలుకునే అవకాశం లభిస్తోందన్నారు. ప్రారంభ దశలోనే చికిత్స ప్రారంభిస్తే పూర్తి నయం చేసే అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు. అనంతరం కన్సల్టెంట్ రేడియేషన్ ఆంకాలజిస్టు డా. అన్వేష్ ఎండ్ల మాట్లాడుతూ ఆధునిక రేడియేషన్ టెక్నాలజీలు మిల్లీమీటర్ స్థాయిలో ఖచ్చితత్వంతో పనిచేస్తాయి. ఇవి కేవలం క్యాన్సర్ కణాలను లక్ష్యంగా చేసుకుని, ఆరోగ్యకర కణజాలాన్ని రక్షిస్తాయి. దీంతో దుష్ప్రభావాలు తగ్గి, రోగులు సురక్షితంగా, సమర్థవంతంగా చికిత్స పూర్తి చేసుకోవచ్చని చెప్పారు. సెంటర్ హెడ్ సంపత్ మాట్లాడుతూ నిజామాబాద్, పరిసర ప్రాంతాల్లో ముఖ్యంగా బ్రెస్ట్ సర్వికల్, మౌత్ , లంగ్ క్యాన్సర్ కేసులు అధికంగా కనిపిస్తున్నాయి. జీవనశైలి మార్పులు, పొగాకు వినియోగం, ఆలస్యంగా పరీక్షలు చేయించుకోవడం ప్రధాన కారణాలు. ప్రజలు నిర్లక్ష్యం చేయకుండా క్రమం తప్పకుండా స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుంటే క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి సమర్థవంతంగా చికిత్స చేయవచ్చని తెలిపారు. అదేవిధంగా మల్టీడిసిప్లినరీ విధానం ద్వారా ఆంకాలజిస్టులు, రేడియాలజిస్టులు, సర్జన్లు, ఇతర నిపుణులు కలిసి ప్రతి రోగికి సమగ్ర చికిత్స అందిస్తున్నారని నిపుణులు పేర్కొన్నారు. ప్రజల్లో అవగాహన పెంచడం మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు వెల్లడించారు.




## తెలంగాణ ఉద్యమకారునికి ఘన సన్మానం

### సీనియర్ జర్నలిస్ట్ నారాయణను సన్మానించిన దళిత, బిసి, మైనార్టీ నాయకులు

**ఆర్మూర్, ఏప్రిల్ 25 ( నినాదం):**
నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం మండల కేంద్రమైన మోర్తాడ్ జాతీయ రహదారి ప్రక్కనే గల పూలే విగ్రహం వద్ద శనివారం మోర్తాడ్ మండల దళిత సంక్షేమ సంఘం, బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ జర్నలిస్టు బండి నారాయణను దళిత సంక్షేమ సంఘం నాయకులు మల్లూరి రాజారాం, జాంబవ చామర్, మామిడి గంగాధర్, అంబేద్కర్ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు, జర్నలిస్టు మామిడి రాజు, బీసీ సంక్షేమ సంఘం నాయకులు కుమ్మరి దశరథ్, ఎల్.ఐ.సి. వెంకటేష్, మైనార్టీ నాయకులు పాలెం నహీంలు తెలంగాణ ఉద్యమకారులైన, సీనియర్ జర్నలిస్ట్ బండి నారాయణకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా దళిత సంక్షేమ సంఘం నాయకులు, బీ.సీ. సంక్షేమ సంఘం నాయకులు పలువురు మాట్లాడుతూ హైదరాబాద్ ఫ్రీ జోన్ కాదురా– హైదరాబాద్ మాదిరా అంటూ మోర్తాడ్ జాతీయరహదారి పక్కనే, దళిత, బిసి, అన్ని వర్గాలకు చెందిన పలువురు నాయకులతో కలిసి 14 రోజులపాటు ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందని, అందులో బండి నారాయణ సైతం ఉద్యమానికి నిరంతరం కొనసాగిస్తూనే అన్ని విధాలుగా సహకరించారని వారన్నారు. అంతేగాకుండా తెలంగాణ మలి విడత ఉద్యమంలో మోర్తాడ్ జాతీయ రహదారి పక్కనే టెంటు వేసుకుని, దళిత, బడుగు, బలహీన, మైనార్టీ, అన్ని పార్టీ నాయకులతో కలిసి తెలంగాణ రాష్ట్ర సాధనకై అందరితో కలిసి ఒకపక్క ఉద్యమం చేస్తూ, మరోపక్క జర్నలిస్టుగా ఉద్యమ వార్తలను అన్ని పత్రికలకు అందిస్తూ ఎంతో సేవ చేశారని, ఆయన జీవితాన్ని ఉద్యమంలో ఎంతో నష్టం పోయినప్పటికీ నిరంతరం ఉద్యమాన్ని కొనసాగించడం జరిగిందని వారన్నారు. జర్నలిస్టుగా, జర్నలిస్టు ఫోటోగ్రాఫర్ గా, ఉద్యమం చేస్తూనే, అన్ని పత్రికలకు ఫోటోలు అందిస్తూ కృషి చేశారని వారన్నారు. పత్రిక జర్నలిస్టుగా 30 ఏళ్ల నుండి పార్టీలకతీతంగా, రాజకీయాలకు అతీతంగా, అన్ని వర్గాల ప్రజల సాధక, బాధకాలలోనూ, గ్రామాలలో అభివృద్ధికి, గ్రామాలలోని ప్రజల సమస్యలను, అధికారులకు, నాయకులకు భయపడకుండా ఎంతోమంది నిరుపేదల సమస్యలను వార్త కథనాలు రాస్తూ వారి సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేసే వారిని వారు పేర్కొన్నారు. గత 30 ఏళ్లుగా జర్నలిస్టుగా,తెలంగాణ ఉద్యమకారునిగా, హైదరాబాద్ ఫ్రీ జోన్ కు వ్యతిరేకంగా ఉద్యమించిన, గ్రామ అభివృద్ధి కమిటీలు, పోలీస్ అధికారులు, వివిధశాఖల అధికారులు, పలు కుల సంఘాల సభ్యులు బెదిరింపులకు పాల్పడ్డ, తప్పుడు ప్రచారాలు చేసిన అవేమీ పట్టించుకోకుండా తనదైన శైలిలో వార్తలు, వాస్తవాలు రాస్తూ అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరిస్తూ అండగా నిలిచే ఏకైక జర్నలిస్టుగా పేరుందిన బండి నారాయణ అనే సీనియర్ జర్నలిస్టును ఎవరు గుర్తించిన, గుర్తించక పోయినా, ఇప్పటికీ అదే బాటలో కొనసాగుతుండడం, తెలంగాణ ఉద్యమకారునిగా, హైదరాబాద్ ఫ్రీ జోన్ మీది కాదురా మాదిరా అంటూ వ్యతిరేకంగా మా తోటి ఉద్యమాలు కొనసాగిస్తూనే, తెలంగాణ ఉద్యమంలోనూ తమతో నిరంతరం 14 ఏళ్ల పాటు ఉద్యమంలో తమతో పాటు కృషి చేయడం పట్ల, దీంతో తాము ఆయన చేస్తున్న సేవలను, ఉద్యమాలను గుర్తించి సన్మానించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, తెలంగాణ ఉద్యమకారులు బండి నారాయణ మాట్లాడుతూ తనకు నిరుపేదలైన మండల దళిత సంఘాల నాయకులు, బి.సి, సంఘాల నాయకులు సన్మానించడం పట్ల మరింత బాధ్యతను పెంచారని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, మహాత్మ జ్యోతిరావు పూలే ఆశయాల మేరకు, ఎవరు ఎన్ని అపార్థాలు చేసిన, ఎన్ని శాఖల అధికారులు వేధించిన, బెదిరించిన, ఒకవేళ కేసులు సైతం నమోదు చేసిన తాను ప్రధానంగా నిరుపేదల సమస్యలపై, అవినీతి, అక్రమాలపై, గ్రామాలలోని అన్ని వర్గాల ప్రజల సమస్యలపై ధైర్యంగా మరింత కథనాలు రాస్తూ ప్రజలకు అండగా నిలుస్తారని సీనియర్ జర్నలిస్ట్, తెలంగాణ ఉద్యమకారులు బండి నారాయణ పేర్కొన్నారు. తనను సన్మానించిన దళిత మండల నాయకులకు, బిసి సంఘం నాయకులకు, మైనార్టీ నాయకులకు పేరుపేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.





## ములుకనూరు సంఘాన్ని సందర్శించిన ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి, రామ్కీ ఫౌండేషన్ ప్రతినిధులు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 25 (నినాదం);**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూరు సంఘాన్ని శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేకాధికారి వేయిల శ్రీనివాసులు, రామ్కీ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.వి. రామిరెడ్డి సందర్శించారు.ఈ సందర్భంగా సంఘం సభ్యులకు అందిస్తున్న వివిధ కార్యక్రమాలు, సేవల గురించి సంఘం జనరల్ మేనేజర్ ఎం. రాంరెడ్డి వారికి సమగ్రంగా వివరించారు. రైతులకు, సభ్యులకు అందిస్తున్న సౌకర్యాలు, అభివృద్ధి కార్యక్రమాలపై వారు ఆసక్తిగా విచారించారు.ఈ కార్యక్రమంలో ములుకనూరు గ్రామ సర్పంచ్ జాలి ప్రమోద్ రెడ్డి, మాజీ సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సుద్దాల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

## నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్.. ఇద్దరిపై కేసు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 25 (నినాదం)**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూరు గ్రామంలో నకిలీ సంతకం, స్టాంప్‌తో డాక్యుమెంట్లు సృష్టించి రిజిస్ట్రేషన్ చేపట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఇద్దరిపై పోలీసులు ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల వివరాల ప్రకారం, ముల్కనూరు పంచాయతీ కార్యదర్శి జంగం పూర్ణచందర్ యొక్క సంతకం ఫోర్జరీ చేయబడినట్లు, అలాగే స్టాంప్ కూడా నకిలీదిగా ఉన్న డాక్యుమెంట్లు సృష్టించబడినట్లు గుర్తించారు. ఈ నకిలీ పత్రాలతో ముల్కనూరు గ్రామానికి చెందిన కనగండ్ల అఖిల్, కనగండ్ల సదానందం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి ఇచ్చిన ఫిర్యాదు పై ముల్కనూరు ఎస్ ఐ రాజు, సదరు ఇద్దరు వ్యక్తులపై ఫోర్జరీ, చీటింగ్ కేసులు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నట్లు పోలీసులు తెలిపారు.



## భూమిలోకి చొరబడి మట్టి తరలింపు.. ఇద్దరిపై కేసు నమోదు

**భీమదేవరపల్లి ఏప్రిల్ 25 (నినాదం);**
హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో భూ వివాదం ఉద్రిక్తతకు దారితీసింది. కొత్తపల్లి గ్రామానికి చెందిన లంక దాసరి పూర్ణచందర్ (తండ్రి రాజయ్య)కు చెందిన భూమిలోకి గ్రామానికే చెందిన ఇద్దరు వ్యక్తులు చొరబడి మట్టిని అక్రమంగా తరలించిన ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం, కొత్తపల్లి గ్రామ శివారులో సర్వే నంబర్ 226/1లో ఉన్న 1 ఎకరం 13 గుంటల భూమిలోకి వేల్పుల యేసేబు, వేల్పుల పాపమ్మ అనే ఇద్దరు ప్రవేశించి సుమారు లక్ష రూపాయల విలువైన మట్టిని తవ్వి తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించిన లంక దాసరి పూర్ణచందర్ వారిని ప్రశ్నించగా, ఆ భూమి తమదేనని పేర్కొంటూ దూషణలకు దిగడమే కాకుండా బెదిరించినట్లు బాధితుడు ఫిర్యాదులో తెలిపాడు. దీంతో పూర్ణచందర్ ముల్కనూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదేవిధంగా, ఈ భూ వివాదానికి సంబంధించి వేల్పుల పాపమ్మను భీమదేవరపల్లి మండల తహసీల్దార్ ముందు బైండోవర్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ ఘటనపై పూర్తి వివరాలు తెలుసుకునేందుకు పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.



## కోర్టు పనులను పర్యవేక్షించిన సీనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి శ్రీదేవి

**ఆర్మూర్, ఏప్రిల్ 25 (నినాదం):**
భీమ్‌గల్ పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న కోర్టు పనులను, స్థానిక భీంగల్ పట్టణంలో గల ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేస్తున్న నూతన కోర్టు పనులను ఆర్మూర్ కోర్ట్ సీనియర్ సివిల్ న్యాయమూర్తి శ్రీదేవి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల అధికారులతో కలిసి, కోర్టు సంబంధిత పనితీరును న్యాయమూర్తి శ్రీదేవి పరిశీలించారు.కోర్టు పనులను వేగవంతం తోపాటు, పారదర్శకతపై దృష్టి పెట్టాలని ఆర్మూర్ సివిల్ కోర్ట్ న్యాయమూర్తి శ్రీదేవి సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ, సంతోష్ కుమార్, ఏఈ విక్రం న్యాయవాదులు చైతన్య, సురేష్, ప్రవీణ్ చందర్, సుదర్శన్, శంకర్, నాగరాజు, సిబ్బంది, ఏ.పీ.ఓ. నరసయ్య, తదితరులు, పాల్గొన్నారు.

## అడిషనల్ కమిషనర్, డిఎంహెచ్ఓకి కాంగ్రెస్ నాయకుల వినతి

**గుండాల, ఏప్రిల్ 25 (నినాదం):**
గుండాల మండలంలో నెలకొన్న వైద్య సమస్యలపై శనివారం గుండాల పీహెచ్సీ నీ సందర్శించడానికివచ్చిన అడిషనల్ కమిషనర్, డిఎంహెచ్ఓ కి కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు పొంబోయిన ముత్తయ్య నాయకత్వంలో మండల నాయకులు పలు సమస్యలతో కూడిన వినతి పత్రం అందజేశారు. ప్రధానంగా గుండాల మండల పరిధిలో సుమారు 14000 మంది జనాభా ఆదివాసి, గిరిజన, గిరిజన పేద ప్రజలు జీవిస్తున్నారు .ఇంత జనాభా ఉన్నా మండలానికి పోస్టు మర్డర్ మార్చురీ లేకపోవడంతో 70 కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుందని వారు గుండాల మండల కేంద్రానికి పోస్టుమార్టం మార్చురీ నిర్మాణం చేయాలని వినతి పత్రం అందజేశారు. అదేవిధంగా గుండాల పిహెచ్సి పరిధిలో డయాలసిస్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని అలాగే 30 పడకల ఆసుపత్రిగా మార్చాలని వినతి పత్రాలు అందజేశారు. వినతి పత్రాలు అందుకున్న డిఎంహెచ్ఓ అడిషనల్ కమిషనర్ స్పందిస్తూ త్వరలోనే వీటిని నిర్మాణాలకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వాంకుడోత్ బికోజి (అజయ్) నాయకులు ఎస్కే అబ్దుల్ నబీ, ఎస్.కె కాసిం, గుర్రం పుష్పరాజు, గడ్డం రాజేష్, ఎస్ కే ఇస్రాజ్, బొంగు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రపంచ మలేరియా దినోత్సవం.. అశ్వాపురంలో అవగాహన ర్యాలీ

### మలేరియా రహిత సమాజమే లక్ష్యం: వైద్యాధికారి డాక్టర్ అఖిల్




**అశ్వాపురం, ఏప్రిల్ 25(నినాదం):**
ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అశ్వాపురంలో శనివారం ఘనంగా కార్యక్రమాలు నిర్వహించారు. మలేరియా నిర్మూలనపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు వైద్యశాఖ ఆధ్వర్యంలో విస్తృత ర్యాలీ చేపట్టారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారామ్ రాథోడ్, జిల్లా మలేరియా నివారణ అధికారి ఆదేశాల మేరకు మండల వైద్యాధికారి డాక్టర్ అఖిల్ నాయకత్వంలో ఈ ర్యాలీ జరిగింది.ర్యాలీలో వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొని మలేరియా నివారణపై నినాదాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా డాక్టర్ అఖిల్ మాట్లాడుతూ, దోమల ద్వారా వ్యాపించే మలేరియా పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. జ్వరం, వణుకు, చెమటలు పట్టడం, తలనొప్పి, అలసట వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రిలో ఉచిత రక్తపరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సమయానికి గుర్తిస్తే మలేరియాను పూర్తిగా నియంత్రించవచ్చని చెప్పారు.దోమల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటి పాత్రలకు మూతలు పెట్టాలి. రాత్రివేళల్లో దోమతెరలు వాడటం ద్వారా దోమల నుంచి రక్షణ పొందవచ్చని సూచించారు.2030 నాటికి మలేరియా రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైద్యాధికారి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు పుష్పావతి, శ్యామలత, సద్గుణవాణి, ఏఎన్ఎంలు లక్ష్మి , కుమారి, శాంతమ్మ, ఎంఎల్హెచ్‌పీ షారున్, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, కిరణ్ కుమార్, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## సెలూన్ కార్మికుడిపై దురుసు ప్రవర్తన ఎస్ఐ సస్పెన్షన్

### సీసీటీవీ దృశ్యాలు వెలుగులోకి రావడంతో ఉన్నతాధికారుల కఠిన చర్య

**కరీంనగర్, ఏప్రిల్ 25(నినాదం )**
కరీంనగర్ నగరంలోని దుర్గమ్మగడ్డ, ఖాన్‌పురా ప్రాంతంలో ఉన్న ఒక కేశ కట్టింగ్ కేంద్రంలో పోలీసు అధికారి అనుచిత ప్రవర్తనకు పాల్పడిన ఘటనపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నారు. కరీంనగర్ త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఉప నిరీక్షకుడు ఎస్. చైతన్య చందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.శనివారం రోజున ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో ఆయన 'న్యూ ప్రజా హెయిర్ స్టైల్' దుకాణానికి వెళ్లగా, అక్కడ పని చేస్తున్న పగిడాల రాము (50) మర్యాదపూర్వకంగా "అన్నా కూర్చో" అని పలికాడు. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎస్ఐ, అసభ్య పదజాలంతో దూషించి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన దుకాణంలోని నిఘా కెమెరాల్లో రికార్డు కావడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది.విచారణలో, విధులు ముగించుకుని ఇంటికి వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు తేలింది. సామాన్య పౌరుడిపై దాడి చేయడం, అధికార దుర్వినియోగం చేయడం, విధి నిర్వహణలో అనుచిత ప్రవర్తనకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌష్ ఆలం, రాజన్న జోన్– త్రి ఉప మహానిరీక్షకుడి సిఫారసుతో సస్పెన్షన్ విధించారు.పోలీస్ శాఖ క్రమశిక్షణకు ప్రాధాన్యత ఇస్తుందని, ప్రజలతో దురుసుగా ప్రవర్తించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం తప్పదని కమిషనర్ స్పష్టం చేశారు.

ఆదివారం, తెలంగాణ
26 ఏప్రిల్ 2026

# నినాదం

## తెలంగాణ ప్రాంతీయం

నిఖార్సైన జర్నలిజం

## శంకర్ గౌడ్ కుటుంబానికి రూ. కోటి ఎక్స్ గ్రేషియా ఇవ్వాలి

### బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు



**పాలేరు ఏప్రిల్ 25( నినాదం):** ఆర్టీసీ డ్రైవర్ శంకర్ గౌడ్ మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయన కుటుంబానికి న్యాయం చేయాలని బీఎస్పీ మండల ప్రధాన కార్యదర్శి బొడ్డు బాబురావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10 లక్షల ఆర్థిక సహాయం సరిపోదని, శంకర్ గౌడ్ కుటుంబానికి కనీసం రూ.1 కోటి నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. శంకర్ గౌడ్ ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆయన కోరారు. భవిష్యత్ లో కూడా ఆర్టీసీ కార్మికులు ఆందోళనకు గురికాకుండా, ఆవేశపూరిత నిర్ణయాలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం చేసుకోవాలని విజ్ఞప్తి చేసారు. మృతుడి కుటుంబ సభ్యులలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై ప్రభుత్వం సానుభూతితో స్పందించి బాధిత కుటుంబానికి తగిన న్యాయం చేయాలని కోరారు. బీఎస్పీ నాయకత్వంలో శంకర్ గౌడ్ కుటుంబానికి న్యాయం జరిగే వరకు పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని ఆయన స్పష్టం చేశారు.

## ఘనంగా ప్రపంచ మలేరియా దినోత్సవం







**గుండాల, ఏప్రిల్ 25 (నినాదం):** శనివారం మండల కేంద్రంలో ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ తుకారం రాథోడ్ పాల్గొని గుండాల పురవీధులలో అవగాహన ర్యాలీ నిర్వహించి మానవహారం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా అనేది దోమల ద్వారా వ్యాప్తి చెందే ప్రమాదకర వ్యాధి అని, ముఖ్యంగా వర్షాకాలం నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో దీని వ్యాప్తి ఎక్కువగా ఉంటుందని తెలిపారు. మలేరియాను సమయానికి గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే పూర్తిగా నియంత్రించవచ్చని పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మలేరియాను అంతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని వారు కోరారు. 2030 సంవత్సరం కల్లా మలేరియా రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, అందుకుగాను ప్రభుత్వం మలేరియా నిర్మూల కోసం పలు కార్యక్రమాలు చేపడుతూ ఆ దిశగా పయనించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ సుదీప్,సబ్ యూనిట్ అధికారి భద్రు, హెల్త్ సూపర్వైజర్ రాజు, హెచ్ వి భూలక్ష్మి, మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ సత్యం, ఎల్ టి దేవా, హెల్త్ అసిస్టెంట్లు భిక్ష, రాఘవులు, రమేష్, ఆశా కార్యకర్తలు, పీహెచ్ సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలపై సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

### పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ నిర్వహించాలి

### సబ్ కలెక్టర్



**అశ్వాపురం, ఏప్రిల్ 25 (నినాదం):** అశ్వాపురం మండలంలోని అమ్మగారిపల్లె, గొండిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను శనివారం భద్రాచలం సబ్ కలెక్టర్ సందర్శించారు. ఈ సందర్భంగా కొనుగోలు ప్రక్రియను సమీక్షిస్తూ కేంద్రాల నిర్వహణపై అధికారులకు పలు సూచనలు చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరైన రిజిస్టర్లు నిర్వహించేందుకు వ్యవసాయ అధికారులు ఇన్‌చార్జ్‌లకు మార్గదర్శనం చేయాలని ఆదేశించారు. రైతులకు సమయానుకూలంగా సమాచారం అందించేలా చర్యలు తీసుకోవాలని, తరచూ అడిగే ప్రశ్నలు ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని సూచించారు.అలాగే కేంద్రాలకు వచ్చే రైతులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, ప్రతి కొనుగోలు కేంద్రంలో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా కొనుగోలు ప్రక్రియ కొనసాగించాలని సబ్ కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అశ్వాపురం తహసీల్దార్ సూర్య ప్రకాష్ , సివిల్ సప్లై డీటి శివకుమార్, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అశ్వాపురం పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుపై ఫిర్యాదు

### సోషల్ మీడియాలో అనుచిత పోస్టులు చేశారనే ఆరోపణ

### చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు విజ్ఞప్తి



**అశ్వాపురం,ఏప్రిల్ 25 (నినాదం):** అశ్వాపురం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావుపై అశ్వాపురం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారని ఆరోపిస్తూ ఈ ఫిర్యాదు నమోదు చేశారు.కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ, ప్రజాప్రతినిధులపై అవమానకర వ్యాఖ్యలు చేయడం తగదని, సామాజిక మాధ్యమాలను బాధ్యతాయుతంగా ఉపయోగించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఇలాంటి వ్యాఖ్యలు ప్రజల్లో అపోహలు, ఉద్రిక్తతలు సృష్టించే అవకాశముందని ఆందోళన వ్యక్తం చేశారు.ఈ అంశంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరినట్లు తెలిపారు.

# ప్రజల వద్దకే ప్రభుత్వం...

### ప్రజాదర్బార్‌తో గ్రామ సమస్యలకు పరిష్కారం..

### చెప్పులు అరిగే రోజులకు చెక్...

### న్యాయమైన ప్రతి అభ్యర్థనకు కుటుంబ పెద్దగా నిలుస్తా

### మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**పాలేరు ఏప్రిల్ 25( నినాదం):** గ్రామాల్లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలకు పరిష్కారం చూపేందుకే ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి ఉండకూడదన్నదే ఈ ప్రజా ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని పొంగులేటి స్పష్టం చేశారు. ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా పాలేరు నియోజకవర్గంలో వినూత్నంగా చేపట్టిన ప్రజా దర్బార్' కార్యక్రమాన్ని శనివారం రాయిగూడెం క్లస్టర్ పరిధిలో నిర్వహించారు. రాయిగూడెం, అజయ్‌తండా, చెరువుమాదారం, మంగాపురం తండా, అప్పలనరసింహపురం, బుద్ధారం, కట్టుకాచారం, కొంగర, రాజారాంపేట, భైరవునిపల్లి గ్రామ పంచాయతీలకు చెందిన ప్రజలతో మంత్రి పొంగులేటి ముఖాముఖి భేటీ అయ్యారు. ప్రజల కోసం ప్రభుత్వం ఎలా పనిచేస్తుందో ప్రజలు ప్రత్యక్షంగా చూస్తున్నారని, గతంలో ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అధికారుల చుట్టూ చెప్పులు అరిగేలా తిరగాల్సి వచ్చేదని, కానీ ప్రస్తుతం ప్రజా ప్రభుత్వం ప్రజల వద్దకే వెళ్లి సమస్యలను పరిష్కరిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ప్రజా పాలనలో భాగంగానే ఈ ప్రజాదర్బార్ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు.

**ప్రజల విశ్వాసమే కాంగ్రెస్‌కు బలం: మంత్రి**

అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో విశ్వాసం మరింత పెరిగిందని మంత్రి తెలిపారు. అందువల్ల ఏ ఎన్నిక జరిగినా ప్రజలు ప్రభుత్వానికి మద్దతు ఇస్తారనే ధీమా వ్యక్తం చేశారు. ప్రజలకు మేలు చేసే పనుల్లో పార్టీ భేదాలు చూడకుండా వ్యవహరిస్తామని, ఎవరు వచ్చినా న్యాయమైన సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 27వ తేదీ నుంచి ఉమ్మడి జిల్లాలో ప్రజాప్రతినిధులు, అధికారులతో సమావేశాలు నిర్వహించి ప్రజా సమస్యలపై సమగ్ర సమీక్ష చేపట్టనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా వేసవి కాలంలో తలెత్తే తాగునీరు, విద్యుత్, భూ సంబంధిత సమస్యలను ముందుగా పాలేరు నియోజకవర్గంలో పరిష్కరించి, అనంతరం రాష్ట్రవ్యాప్తంగా అమలు చేసేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఒక్క సమావేశంతోనే అన్ని సమస్యలు పరిష్కారం కావని స్పష్టం చేసిన మంత్రి, ప్రజలు లేవనెత్తే సమస్యలు న్యాయమైనవైతే వాటిని కుటుంబ పెద్దగా భావించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలి

- రైతు సంఘం డిమాండ్



**అశ్వాపురం,ఏప్రిల్ 25 (నినాదం):** మండల పరిధిలోని మొండికుంట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం (ఏఐకేఎస్) అశ్వాపురం మండల కమిటీ ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండలంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై విస్తృతంగా చర్చించారు.కాకతీయుల కాలానికి చెందిన తుమ్మలచెరువు కింద యాసంగి పంటలో వరి సాగు చేసిన రైతులు ప్రస్తుతం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సంఘం నేతలు తెలిపారు. పంట కోత పూర్తై దాదాపు 20 రోజులైనా, ధాన్యాన్ని కొనుగోలు చేసే పరిస్థితి లేకపోవడంతో రైతులు కల్లాల వద్ద ఆరబోసి ఉంచి తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు.అకాల వర్షాలు ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితిలో, పంట నష్టపోయే ప్రమాదం ఉందని, రైతులు ఆవేదనతో కన్నీటి పర్యంతమవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రాష్ట్రవ్యాప్తంగా వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ముఖ్యంగా అశ్వాపురం మండలంలోని మొండికుంట, నెల్లిపాక, మల్లెలమడుగు, రామచంద్రపురం గ్రామపంచాయతీల పరిధిలో కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించి రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేయాలని కోరారు. రైతుల సమస్యలను పట్టించుకోకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు, ధర్నాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.రైతులు రోడ్డెక్కే పరిస్థితి రాకుండా ప్రభుత్వం, అధికారులు వెంటనే చర్యలు తీసుకుని సమస్యను పరిష్కరించాలని రైతు సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో అశ్వాపురం మండలం రైతు సంఘం అధ్యక్షుడు బద్దం సమ్మిరెడ్డి, సుధాకర్ రెడ్డి, గొడుగు వెంకన్న, పగడాల అశోక రెడ్డి, బొమ్మరాతి రామయ్య, దండి రాములు తదితరులు పాల్గొన్నారు.

## కన్నారావుపేటలో ఉపాధిహామీ పనులకు శ్రీకారం

- నిరుద్యోగులకు ఉపాధి -- గ్రామాభివృద్ధికి బాటలు
- చెరువుల పునరుద్ధరయుణ, రహదారులు, నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యం



**నల్లబెల్లి,ఏప్రిల్ 25 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని కన్నారావుపేట గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఉపాధి హామీ పనులు ఘనంగా ప్రారంభమయ్యాయి. గ్రామ సర్పంచ్ పల్నాటి మూర్తి పనులకు శ్రీకారం చుట్టగా, గ్రామంలో అభివృద్ధి పనులకు నాంది పలికింది.ఈ సందర్భంగా సర్పంచ్ పల్నాటి మూర్తి మాట్లాడుతూ, గ్రామంలోని నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే కాకుండా, గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయడంలో ఈ పథకం కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు. ముఖ్యంగా చెరువుల పునరుద్ధరణ ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీటి సమస్యలు కొంతవరకు తగ్గుతాయని చెప్పారు.గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం, పునరుద్ధరణ పనులు చేపట్టడం వల్ల రవాణా సౌకర్యం మెరుగుపడుతుందని, విద్యార్థులు, రైతులు, మహిళలకు సౌలభ్యం కలుగుతుందని వివరించారు. నీటి సంరక్షణ చర్యల ద్వారా వర్షపు నీటిని నిల్వ చేసి భవిష్యత్ అవసరాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి కనీసం 100 రోజుల ఉపాధి కల్పించాలనే ప్రభుత్వ లక్ష్యాన్ని గ్రామస్థాయిలో విజయవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తున్నామనీ అన్నారు. కార్మికులకు సమయానికి వేతనాలు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని, పనుల్లో పారదర్శకతకు ప్రాధాన్యం ఇస్తామని స్పష్టం చేశారు. గ్రామ ప్రజలు అందరూ ఉపాధి హామీ పనుల్లో పాల్గొని ప్రభుత్వ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ పిలుపునిచ్చారు. మహిళలు, యువత ముందుకు రావాలని, ఇది ఆర్థిక స్థిరత్వానికి దోహదం చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఉపాధి హామీ సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పనుల ప్రారంభంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది. అధికారులు పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారిస్తూ, సమయానికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## ఘనంగా నారక్కపేట అంగన్‌వాడీలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు





- చిన్నారుల ప్రతిభకు వేదిక -- సర్టిఫికెట్ల ప్రదానం
- ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**నల్లబెల్లి, ఏప్రిల్ 25 (నినాదం):** వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నారక్కపేట గ్రామంలోని అంగనవాడీ కేంద్రాలు లో గ్రాడ్యుయేషన్ డే వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ దండెం సంపత్ హాజరై చిన్నారులను,అభినందించారు. ఉప సర్పంచ్ సూరబోయిన రాంబాబు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ దండెం సంపత్ మాట్లాడుతూ, అంగనవాడీ కేంద్రాలు చిన్నారుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. ప్రాథమిక స్థాయిలోనే విద్యపై ఆసక్తి పెంపొందించడం, శారీరక--మానసిక వికాసానికి సహకరించడం ఈ కేంద్రాల ప్రధాన లక్ష్యమని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. వేడుకల్లో చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. నృత్యాలు, పాటలు, చిన్న నాటికల ద్వారా తమ ప్రతిభను చాటుకున్నారు. రంగురంగుల దుస్తుల్లో వేదికపై చిన్నారులు చేసిన ప్రదర్శనలు హాజరైన వారిని అలరించాయి.అంగనవాడీ కేంద్రంలో చదువు పూర్తి చేసిన చిన్నారులకు గ్రాడ్యుయేషన్ సందర్భంగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో ఆత్మవిశ్వాసం పెంపొందించడమే కాకుండా, పాఠశాల విద్యకు సిద్ధం చేసే దిశగా ఇది కీలక అడుగుగా నిలుస్తుందని,ఉపాధ్యాయులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్, అంగనవాడీ టీచర్లు బి. వెంకటలక్ష్మి, శరణ్య, తల్లిదండ్రులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామ ప్రజల సహకారంతో ఈ వేడుకలు విజయవంతంగా నిర్వహించబడ్డాయి.అంగనవాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం, ఆరోగ్య సేవలు, ప్రాథమిక విద్య,అందించబడుతున్నాయి. ఈ తరహా గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలు పిల్లల్లో ఉత్సాహాన్ని పెంచి, భవిష్యత్ విద్యాభ్యాసానికి ప్రేరణగా నిలుస్తాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పనులపై ఎమ్మెల్యే పాయం సమీక్ష

### నాణ్యతతో పాటు వేగంగా పనులు పూర్తి చేయాలని ఆదేశాలు



**అశ్వాపురం, ఏప్రిల్ 25 (నినాదం):** అశ్వాపురం మండలం బిజీ కొత్తూరు గ్రామ పరిధిలో, పంప్ హౌస్ సమీపంలో కొనసాగుతున్న మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను స్థానిక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులతో సమీక్షించి, నిర్మాణ పనులను నాణ్యతతో పాటు వేగంగా పూర్తి చేయాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ఈ ప్రాజెక్టు పూర్తయితే మండలంలోని రైతులకు సాగునీరు సమృద్ధిగా అందుతుందని, వ్యవసాయ అభివృద్ధికి ఇది కీలకంగా మారుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. రైతుల సమస్యలను స్వయంగా తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం ప్రభుత్వం తరఫున అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.మారెళ్లపాడు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పూర్తి కావడంతో పరిసర ప్రాంతాల్లోని వ్యవసాయ భూములకు నీటి సరఫరా మెరుగుపడి, రైతుల ఆదాయం పెరుగుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఓరుగంటి బిక్షమయ్య, గాదే కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్ బాబు, ఊసా అనిల్ కుమార్, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సర్పంచులు యేనిక ఉషారాణి, తెల్లం నాగమణి, మచ్చా నరసింహారావు, సబ్కా పిచ్చయ్య, అలాగే నాయకులు మాదినేని రాంబాబు, తుక్కాని మధుసూదన్ రెడ్డి, లంకమల్ల కొండలరావు, తూము వీరరాఘవులు, బరాజు సంపత్ కుమార్, బేతం రామకృష్ణ, బచ్చు వెంకటరమణ, ఎం.డి. శర్ఫుద్దిన్, యేనిక రవి, సోడే వెంకటేశ్వర్లు, గొల్లపల్లి నరేష్, వేముల విజయ్, రావులపల్లి వెంకటనర్సయ్య, నూకల సంపత్, గుండ్రెడ్డి శ్రీనివాసరెడ్డి, కోలా శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారులు గ్రామాల అభివృద్ధికి సూచిక

### శాసనసభ్యులు కాలే యాదయ్య



**చేవెళ్ల ఏప్రిల్ 25(నినాదం):** రహదారులు గ్రామాల అభివృద్ధికి సూచికలు అని శాసనసభ్యులు కాలే యాదయ్య అన్నారు.శనివారం చేవెళ్ల నియోజకవర్గం షాబాద్ మండలంలో పోతుగల్ నుండి మాచనపల్లి వరకు 5 కోట్ల నిధులతో బిటి రోడ్డు నిర్మాణ పనులకు శాసనసభ్యులు కాలే యాదయ్య స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు..ఈ సందర్భంగా ఏమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిలో రహదారుల నిర్మాణం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ బిటి రోడ్డు నిర్మాణంతో పోతుగల్ -- మాచనపల్లి గ్రామాల మధ్య రాకపోకలు మరింత సులభతరం అవుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పామేన నరసింహులు ఏఎంసి చైర్మన్ పిసరి సురేందర్ రెడ్డి, సర్పంచ్ మాణిక్యం గౌడ్, చెన్నయ్య, మండల పార్టీ అధ్యక్షుడు చంద్రశేఖర్, రవీందర్, ఆంజనేయులు జాకీర్ షరీఫ్,అశ్వక్ అలీ గుట్టల కృష్ణ, పామేన రాజు, బండ కిట్టు,స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## అండర్ పాస్ వెసులుబాటు కల్పించండి



**చేవెళ్ళ ఏప్రిల్ 25(నినాదం):** అప్ప జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు నూతన రోడ్డు విస్తరణలో, చేవెళ్ల మండలంలోనీ ఖానాపూర్ గేట్ ఇంద్రా రెడ్డి నగర్ చౌరస్తా దగ్గర అండర్ పాస్ కావాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో నాంచేరి గ్రామ సర్పంచ్ పులుమామిడి అశోక్, గ్రామస్తులు జై శంకర్ గౌడ్,సాయిరాం గౌడ్, రాజలింగం గౌడ్, శ్రవణ్ గౌడ్, హర్షవర్ధన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

